క్లుప్తంగా

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: విద్యార్థుల చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. ఉగాది సందర్భంగా ఏటా గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్ర లేఖన పోటీలకు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఉగాది రోజున బహుమతులు అందజేస్తామని శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం అచ్యుత రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు వడ్డాది వెంకన్న కొబ్బరి చెక్కలు, తలనీలాలకు వేలంపాట

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వెంకటేశ్వరస్వామి కొబ్బరి చెక్కలు, తలనీలాలకు 7వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఈవో శర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 9వ తేదీ నుండి మార్చి 15వ తేదీ వరకు స్వామి వారి ఉత్సవాల్లో ఏడు రోజుల కొబ్బరి చెక్కలకు, ఈ ఏడాది మార్చి 1 నుండి 2026 ఫిబ్రవరి 28వ తేదీ వరకు తలనీలాలకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. కొబ్బరి చెక్కలకు రూ. 30 వేలు, తలనీలాలకు రూ.20 వేలు వేరువేరుగా ప్రథమ ధరావత్తు ముందు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. వేలంపాట అనంతరం కొబ్బరి చెక్కలు, తలనీలాల మిగిలిన మొత్తం నగదును చెల్లించాలని ఈవో తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చీడికాడ : మండలంలో చీడిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానం గురించి రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ శిక్షణ అధికారి ప్రకాష్ హాజరయ్యారు. సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి రైతు రబీ సీజన్‌లో పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి హేమసుందర్, దేముళ్ల, నాగమణి, నాయుడుబాబు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల పరిశీలన



దివ్యాంగుల అంగవైకల్యం పరిశీలిస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్

కె.కోటపాడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు కె.కోటపాడు సీహెచ్‌సీలో బుధవారం రెండు గ్రామాలకు చెందిన దివ్యాంగ పింఛనుదారుల అంగవైకల్యాన్ని పరిశీలించే కార్యక్రమం నిర్వహించారు. చౌడువాడ, కొరువాడ గ్రామాల్లో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న 60 మందిని వైద్యాధికారి కిరణ్‌కుమార్ పరిశీలించారు. దివ్యాంగులు వేచి ఉండేందుకు టెంట్లు, కుర్చీలను ఆస్పత్రి ఆవరణలో ఎంపీడీవో సాంబశివరావు ఏర్పాటు చేయించారు. కార్యక్రమాన్ని ఈ నెల 28 వరకూ కె.కోటపాడు సీహెచ్‌సీలో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

సంతోషిమాత అన్నదాన సత్రానికి భారీ విరాళం



చెక్కును అందజేస్తున్న మోహనరావు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రానికి విశాఖకు చెందిన పాలకుర్తి మోహన్‌రావు తన భార్య పేరున పాలకుర్తి కుసుమ(బొల్లా ప్రగడ కుసుమ) జ్ఞాపకార్థం 1,01,958 రుపాయలు చెక్కును బుధవారం గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి జి.నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ చెక్కును ఆలయ కమిటీ చైర్మన్ అమ్మతల్లినాయుడుకు అందజేస్తామన్నారు.

ఆర్అండ్‌బీ స్థలంలో ఆక్రమణల తొలగింపు

గొలుగొండ : బోద్యం గ్రామంలో ఆర్అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు బుధవారం సాయంత్రం తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఇక్కడ జిరాయితీ భూములకు ఆనుకొని ఆర్అండ్‌బీ స్థలం కొంతమేర ఉంది. ఇక్కడ కొంతమంది ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమించి రైతులు భూముల్లోకి వెళ్లకుండా చేశారు. దీంతో రైతు నాయుడు కోర్టును ఆశ్రయించడంతో ఆక్రమణలు తొలగించాలని ఇచ్చిన తీర్పుపై ఆర్అండ్‌బీ జేఈ ప్రసాద్, గొలుగొండ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

హడలెత్తిస్తున్న వంతెనలు



లచ్చన్నపాలెం వద్ద ప్రమాదకరంగా ఏలేరు కాలువ అక్విడెక్టు



పెద్దిపాలెం వద్ద శిథిలమైన ఏలేరు కాలువ వంతెన రక్షణగోడలు

శిథిలమైన వంతెనల రక్షణ గోడలు

రాత్రి వేళల్లో భయం..భయంగా ప్రయాణం

పట్టించుకోని సంబంధిత అధికారులు

మరమ్మతులు చేయాలి



వంతెనల రక్షణ గోడలకు మరమ్మతులు చేయాలి. రక్షణ గోడలు లేక ప్రమాదాలు జరిగితే మృత్యువాత పడకతప్పదు. అధికారులు స్పందించి ఈ గోడలకు మరమ్మతులు చేయించాలి.

– వి.నరేష్, తూటిపాల

ప్రమాదకరంగా ఏలేరు వంతెనలు



ఏలేరు కాలువపై ఉన్న వంతెనలు ప్రమాదకంగా ఉన్నాయి. రామన్నపాలెం వద్ద ఏలేరు కాలువపై వంతెన రక్షణ గోడలతోపాటు వంతెన కూడా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. అయినా పట్టించుకోవడం లేదు.

– కె.అప్పలనాయుడు, వెంకయ్యపాలెం

మాకవరపాలెం: రక్షణ గోడలులేని వంతెనలు ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. దీంతో ఇటుగా ప్రయాణం చేసేందుకు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఇలాగే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మండలంలోని రామన్నపాలెం, పెద్దిపాలెం, లచ్చన్నపాలెం ప్రాంతాల్లో గెడ్డలు, నదులు, ఏలేరు కాలువపై వంతెనలు నిర్మించారు. ఇవి నిర్మించి చాలా కాలం కావడంతో రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో ఈ వంతెనలపై ప్రయాణాలు సాగించేందుకు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

కొరవడిన రక్షణ...

ఇటీవల కాలంలో వాహనాలపై రాకపోకలు అధికమయ్యాయి. అయితే రామన్నపాలెం జంక్షన్ నుంచి వెంకయ్యపాలెం, రామన్నపాలెం, చినరాచపల్లి, జీ.వెంకటాపురం, సుభద్రయ్యపాలెం, యరకన్నపాలెం వెళ్లేందుకు రామన్నపాలెం వద్ద ఉన్న ఏలేరు కాలువపై ఉన్న వంతెన మీదుగా వెళ్లాలి. ఈ వంతెనకు రెండు వైపులా ఉన్న రక్షణ గోడలు శిథిలమయ్యాయి. ఇక పెద్దిపాలెం, బూరుగుపాలెం, తూటిపాల, తాడపాల వెళ్లేందుకు పెద్దిపాలెం వద్ద ఉన్న ఏలేరు వంతెన, మరో గెడ్డపై ఉన్న వంతెన మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. వీటితో పాటు లచ్చన్నపాలెం వద్ద సర్పానదిపై ఉన్న అక్విడెక్టు వంతెనల రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో ఈ వంతెనల మీదుగా రాకపోకలు సాగించేవారికి రక్షణ కరువైంది.

రాత్రి వేళల్లో భయం..భయం..

రక్షణ గోడలు శిథిలావస్థకు చేరిన వంతెలపై ప్రయాణం చేసేందుకు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పగలు ఎలా ఉన్నా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతాయని హడలిపోతున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా నేరుగా ఏలేరు కాలువలోకో, గెడ్డల్లోనో పడి గాయాలపాలవ్వక మానదు. గాయాల మాట పక్కనపెడితే ప్రాణాలు కోల్పోతే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. పెద్దవాళ్లతోపాటు నిత్యం విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలలు, కళాశాలలకు ఈ వంతెనల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ఈ వంతెనలకు రక్షణ గోడలకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రేపు సంతోషిమాత తీర్థం



సంతోషిమాత అమ్మవారు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత అమ్మవారి తీర్థం ఈ నెల 7వ తేదీన ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన, సాయంత్రం నుంచి ఆలయంలో భజన కార్యక్రమం, మహిళలు కోలాటం జరుగుతుందని తెలిపారు.

అన్నదాన సత్రం నూతన భవనం ప్రారంభోత్సవం

ఈ సందర్భంగా ఆలయం పక్కన్న నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రం నూతన భవనాన్ని మధ్యాహ్నం 11.26 గంటలకు ప్రారంభిస్తామని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో పాటు, ఎమ్మెల్యేలు పి.జి.వి.ఆర్.నాయుడు(గణబాబు), కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రులు బూడి ముత్యాలునాయుడు, దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు కరణం ధర్మశ్రీ, వివిధ కార్పోరేషన్ చైర్మన్‌లు పీలా గోవింద సత్యనారాయణ, పి.వి.జి.కుమార్, బత్తుల తాతయ్యబాబు, దేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు హాజరవుతారని అమ్మతల్లినాయుడు తెలిపారు. అన్నసమారాధనలో పాల్గొనే భక్తులకు కూపన్‌లు అందజేసి డ్రా తీసి, బహుమతులు అందజేస్తామన్నారు.



కె.జె.పురం జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రం

గిరి గ్రామాలు కలుపుతూ రోడ్డు నిర్మాణం



పనులు జరుగుతున్న దృశ్యం

గొలుగొండ : పప్పుశెట్టిపాలెం నుండి పీఎన్‌డీపాలేనికి రోడ్డు పనులు శరవేగంగా జరుపుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేయడం వల్ల కంఠారం, పెసరాడ, అడ్డల్లోవ, సుద్దలపాలెం వంటి గిరిజన గ్రామాలకు మేలు జరుగుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారుగా రూ.6 కోట్లు నిధులు మంజూరు కాగా రోడ్డు పనులు ప్రారంభం జరిగే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

తామరం లేఅవుట్‌కు అనుమతి లేదు



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తామరం కార్యదర్శి బాలదొర

మాకవరపాలెం : మండలంలోని తామరంలో నూతనంగా వేసిన లేఅవుట్‌కు అనుమతులు లేవని పంచాయతీ కార్యదర్శి బాలదొర తెలిపారు. తామరం రెవెన్యూలో సర్వే నంబర్ 67లో ఇటీవల సుమారు పది ఎకరాల్లో లేవుట్ వేశారు. సెంట్ల చొప్పున విభజించి సరిహద్దు రాళ్లను సైతం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శి బాలదొర లేఅవుట్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. లే అవుట్ ఫొటోలను కూడా తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నుంచి ఈ లేఅవుట్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అనుమతులు లేకుండా వేసే లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే భవన నిర్మాణాలకు ఇబ్బందులు పడాల్సివస్తుందని, అన్ని అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకున్న అనంతరమే స్థలాలు కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి



కె.కోటపాడులో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సునీల్

మాడుగుల : క్యాన్సర్‌ను నివారించాలంటే ముందస్తు జాగ్రతలు ద్వారానే సాధ్యమవుతుందని, ఐసీడీఎస్ మాడుగుల ప్రాజెక్టు అధికారి శ్రీదేవి అన్నారు. బుధవారం పూర్వ ప్రాథమిక దినోత్సవం సందర్భంగా చీడికాడ మండలం ఖండివరంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలో 158 అంగన్‌వాడీ కేంద్రాల్లో క్యాన్సర్ వ్యాధి లక్షణాలు గుర్తించి ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత తరుణంలో రొమ్ము, గర్భసంచి, నోటి క్యాన్సర్‌లు వస్తున్నాయని, అవి రాకుండా ప్రతి మహిళ ముందస్తు జాగ్రతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చిన్నమ్మలు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెం : క్యాన్సర్ వ్యాధిపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం క్యాన్సర్ లక్షణాలు, వ్యాధిని గుర్తించడంపై వెలుగు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అందరూ అప్రమత్తంగా ఉంటూ, లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వెలుగు ఏపీఎం మంగ, సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : వెలుగు కార్యాలయంలో బుధవారం డ్వాక్రా వీవోఏ, మహిళలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ పొగాకును నమలడం, తమలపాకును వాడడం, మద్యంను సేవించడం ద్వారా వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారని అన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ వ్యాధి లక్షణాలు గుర్తిస్తే నయం చేసుకోవచ్చన్నారు. వెలుగు పెందుర్తి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఎంపీడీవో సాంబశివరావు, ఏపీఎం చినబాబు పాల్గొన్నారు.

నాతవరం: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం క్యాన్సర్ వ్యాధిపై జరిగిన అవగాహన సదస్సులో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌నాయుడు మాట్లాడారు. క్యాన్సర్ చికిత్సకు ప్రస్తుతం ఆధునాతన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వ్యాధి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పార్థసారథి, ఏపీఎం కనకరాజు పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : దేశ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య మూడు కోట్లకు దాటి పోయిందని, ఈ కారణంగా విద్యార్థి దశలో వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కల్పించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి అన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ప్రారంభించిన సదస్సులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, రత్నభారతి, ఉపన్యాసకులు అప్పలనాయుడు, జ్యోతి, హెచ్.సుధీర్, మల్లిబాబు, నారాయణమూర్తి, కృష్ణారావు, కోమలి, సరస్వతి పాల్గొన్నారు.

చెరువు వివాదంపై విచారణ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

మాకవరపాలెం: చెరువు వివాదంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు విచారణ చేపట్టారు. మండలంలోని నారాయణరాజుపేట వద్దగల రాళ్లకండి చెరువు గట్టుపై ఉన్న కొబ్బరి చెట్ల ఆదాయం తమకు చెందుతుందని నారాయణరాజుపేట రైతులు, బయ్యవరం రెవెన్యూలో ఉన్నందున తమకే చెందుతుందని ఇటీవల గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో నారాయణరాజుపేట రైతులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ రామారావు ఈ చెరువును పరిశీలించారు. ఇరు గ్రామాల పెద్దలతో చర్చించారు. వివాదాలతో సమస్యలు పరిష్కారం కావని, ఆయకట్టు రైతులు కమిటీగా ఏర్పడి వచ్చే ఆదాయాన్ని చెరువు అభివృద్ధికి ఖర్చు చేసుకోవాలని సూచించారు.

వైకల్యాలు కలిగిన పిల్లల జాబితాను సిద్ధం చేయాలి



సూచనలు చేస్తున్న సినియర్ సివిల్ జడ్జి షేయాజ్ ఖాన్

నర్సీపట్నం : వైకల్యాలు కలిగిన పిల్లల గుర్తింపును సమర్థంగా నిర్వహించాలని మండల లీగల్ సెల్ సర్వీస్సు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షేయాజ్ ఖాన్ పేర్కొన్నారు. కోర్టు సముదాయంలో బుధవారం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్, ప్రశాంతి, వైద్యులు, ఆశ వర్కర్స్ అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డోర్ టూ డోర్ సర్వే నిర్వహించి వైకల్యాలు కలిగిన అభివృద్ధి, మానసిక, శారీరక, రకరకాల వైకల్యాలు కలిగిన పిల్లల జాబితాను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రోహిత్, ఐసీడీఎస్ ఇన్‌ఛార్జీ సీడీపీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవ స్థలంలో 60 అడుగుల బండి ప్రభ

రోలుగుంట : మండల కేంద్రం లో నాలుగు రోజుల పాటు నిర్వహించే శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు సుర్ల వర్గీయుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అటవీ ప్రాంతంలో సేకరించిన వెదురుతో సుమారు 60 అడుగులతో నిర్మించిన బండి ప్రభను నిర్వాహకుల ఇంటి వద్ద నుంచి ఉత్సవ స్థలానికి భక్తులు మోసుకొచ్చి ప్రతిష్ఠించారు. గ్రామంలో విద్యుదలంకరణ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గురువారం చిన్న తీర్థం జరుగుతుందన్నారు. ఉదయం నుంచి సాయింత్రం వరకూ గ్రామ యువతతో పలు పగటి వేషాలు నిర్వహించి ఆ రాత్రి సాంఘిక నాటకం నిర్వహిస్తామన్నారు. శనివారం నిమజ్జనోత్సవం జరుగుతుందని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కారు



చెరువులోకి దూసుకుపోయిన కారుపై పడ్డ విద్యుత్ స్తంభం

బుచ్చెయ్యపేట : మండలంలో కొంకోట,బంగారుమెట్ట(కేబి) ఆర్అండ్‌బీ రోడ్డులో పెద్ద ప్రమాదం తప్పింది. బుధవారం సాయంత్రం వడ్డాది నుంచి అనకాపల్లి వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో కారు పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న చెరువులోకి దూసుకుపోయింది. చెరువులోకి దూసుకుపోయిన కారుపైనే విరిగిన విద్యుత్ స్తంభం పడింది. సినీ ఫక్కీలో జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. చెరువులో నీరు లేదు. అలాగే కొత్తగా వేస్తున్న విద్యుత్‌లైన్ అవడంతో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

కేజీబీవీలో ఉత్సాహంగా వార్షికోత్సవం



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

దేవరాపల్లి: బేతపూడి కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో వార్షికోత్సవం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కేజీబివి ప్రిన్సిపాల్ సిహెచ్. భువనమాధురి మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి త్వరలో జరిగే పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థినులకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పైలట్ సర్వేపై శిక్షణ

రోలుగుంట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్.నాగమ్మ బుధవారం భూసర్వేపై సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాలయన్ని బుధవారం రాత్రి సందర్శించిన నర్సీపట్నం ఆర్డీవో భూముల సర్వేపై శిక్షణ ఇచ్చారు. మదర్ రికార్డులో భూవివరాలను పరిశీలించాలన్నారు. వన్ బి, ఎఫ్ఎంబీ, తదితర రికార్డులు పరిశీలన, విధుల నిర్వహణపై అవసరమైన శిక్షణ ఇచ్చారు.

మాడుగుల ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రోడ్డు పరిశీలన



మాడుగుల డిగ్రీ కళాశాల వద్ద ఆర్టీసీ రోడ్డుకు స్థలం పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ తదితరులు

మాడుగుల : పాడేరు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులు స్థానిక డిగ్రీ కళాశాల మీదుగా ఆర్టీ సీ కాంప్లెక్స్‌కు రావడానికి రోడ్డుకు గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ బుధవారం పరిశీలించారు. డిగ్రీ కళాశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మధ్యలో రోడ్డు కేటాయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారన్నారు. డిగ్రీ కళాశాల స్థలం పరిశీలించి కళాశాలకు స్థలం సరిపోతే, రోడ్డుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్ రమాదేవికి ఆదేశాలు జారీ చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.ఎస్.ఎస్. శాస్త్రి, ఎంపీడీవో అప్పారావు, డీటీ లక్ష్మణరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతం చేయాలి

నర్సీపట్నం : గ్రామస్థాయిలో వికాస్ తరంగిణి ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతం చేయాలని వికాస్ తరంగిణి ఆధ్యాత్మిక సంస్థ, రెండు తెలుగు రాష్ట్రాల చీఫ్ ఎడ్యూకూటివ్ ఇన్‌ఛార్జీ భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నవ నిర్మాణ సమితి సమావేశ మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, గ్రామాల అభివృద్ధి, దేశభక్తి అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూధర్మం గ్రామాల్లో సామాన్య ప్రజలకు అందాలంటే ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రవచనాలు, ఆచార సంప్రదాయాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి కాళ్ల సుబ్బారావు, పి.అరవిందరాజు, లిఫ్ట్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మాడుగుల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మానసిక అభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.ఈశ్వరమ్మ పేర్కొన్నారు. కె.జె.పురం 3 వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రీ స్కూలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గల 8 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏఎన్ఎంలు, క్యాన్సర్ వ్యాప్తి, నివారణ గురించి అవగాహన కల్పించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



గోడ పత్రికలు అవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గొలుగొండ: చదువుకున్న యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో యువత చెడు వ్యసనాల బారిన పడుతున్నారని జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకుడు రాధాకృష్ణ తెలిపారు. ఈనెల 6,9న శ్రీకాకుళంలో ఏఐఎస్ఎఫ్ 22 రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, దీనికి ప్రతి గ్రామంలో గోడ పత్రికలు అంటించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మేకా భాస్కర్, భరత్‌కుమార్, మురళి, శివ పాల్గొన్నారు.

సంపద కేంద్రం పరిశీలన

నాతవరం : చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి అన్నారు. మండలంలో బుధవారం మర్రిపాలెం, మాధవనగరం పంచాయతీల్లో గల చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలను పరిశీలించి సిబ్బందితో వానపాములు విడుదల చేయించారు. తర్వాత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త పొడి చెత్త సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రీయ ఎరువులు తయారీ చేసి విక్రయాలు చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. అలాగే ఇళ్ల వద్ద వీధులను తడి చెత్త , పొడి చెత్త లేకుండా చేయడం ద్వారా ప్రజలకు రోగాలు రాకుండా కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్న సిబ్బంది పాల్గొన్నారు.